JANUARY 2016 VOLUME : 1 ISSUE : 3

# TAM Patrika

సంక్రాంతి
శుభాకాంక్షలతో....



## మేరిలాండ్ తెలుగు సంఘం పత్రిక

Visit : www.tamaryland.org

# TAM పత్రిక


సంపుటి - 1

సంచిక - 3

జనవరి - 2016



**ప్రధాన సంపాదకులు**
Editor in Chief
**నాగ ప్రసాద్ గణపనేని**
Naga Prasad Ganapaneni

**నిర్వాహక సంపాదకులు**
Executive Editor
**సందిరెడ్డి కొండలరావు**
Sandireddy Kondala Rao

**సహాయ సంపాదకులు**
Associate Editors
**చెరుకూరి రాజశేఖర్**
Cherukuri Rajasekhar

**స్వాతి రంగా**
Swathi Ranga



**ADDRESS :**
Telugu Association of Maryland,
2713 Sunnyside LN,
Ellicott City, MD 21043.
Phone : 571-499-8645
info@tamaryland.org
e-mail : tampatrika@tamaryland.org


## ....విషయ సూచిక....


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 3 |
| 2. | అధ్యక్షుని సందేశం | 4 |
| 3. | చెన్నై వర్షపాతం | 5 |
| 4. | బుర్రమీసాల పుల్లయ్య తాత | 6 |
| 5. | దోసగింజలతో చెట్నీ | 7 |
| 6. | TAM ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు | 8 |
| 7. | స్వామి వివేకానంద | 11 |
| 8. | సంక్రాంతి | 16 |
| 9. | TAM దసరా దీపావళి ఉత్సవాలు | 20 |
| 10. | Chennai Flood Relief Activities by TAM | 26 |
| 11. | TAM బోన్‌మారో డ్రైవ్ | 31 |
| 12. | TAM ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం | 37 |
| 13. | గమ్యం | 38 |



The opinions expressed in TAM Patrika belong to the individual authors & do not necessarily reflect those of TAM or The Editorial Board.






# సంపాదకీయం

'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' గా అభివర్ణింపబడే అందమైన భాష మన తెలుగు భాష.

ఆంగ్ల మాధ్యమాలతో, సాంకేతిక విప్లవాలతో తెరమరుగవుతున్న తెలుగుభాషా ప్రాశస్త్యాన్ని మన తరువాత తరాల వారికి విశదీకరించాల్సిన బాధ్యత ప్రవాసాంధ్రులందరిపై ఉంది. అచ్చ తెలుగులో మాట్లాడి, తెలుగులో వ్రాసి, తెలుగులో చదివినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

తెలుగుభాష ఒక జీవనది. అద్భుతమైన సంస్కృతీ వారసత్వం మన సొంతం. నన్నయ్య, తిక్కన, ఎర్రా ప్రగడ మనవారు. త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య పలికిన పదం మనది. చరిత్రలో విజయనగర సామ్రాజ్యపు దరహాసం మనది. కాకతీయ సామ్రాజ్యపు పౌరుషం మనది.

కృష్ణశాస్త్రిలా భావుకత్వాన్ని పలకరించాలని ఉంది. ఆత్రేయలా మనసు తీరాలను జయించాలని ఉంది. మన్యం వీరుడు అల్లూరిలా గర్జించాలని ఉంది. మన భాష, మన సంస్కృతి, మన చరిత్ర, మన వంటకాలు, మన నాట్యాలు, మన మహనీయుల జీవిత చరిత్రలు, మన సాంకేతికత పంచుకోవాలని ఉంది.

వీటన్నింటికీ TAM ఒక మంచి వేదిక అవుతుందని ఆశిస్తున్నాను.

శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో ఇలా అన్నారు. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను. నేను సైతం భువన భవనపు బావుటానై నింగికెగిశాను". అలాగే మనందరం TAM మహా ప్రయాణంలో, సాంస్కృతిక కార్యక్రమాల్లో, సహాయ కార్యక్రమాల్లో భాగమవ్వాలని ఆశిస్తున్నాను.

తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా సి.నారాయణరెడ్డి గారు ఇలా ఉటంకించారు.

"తెలుగు జాతి మనది. రెండుగ వెలుగు జాతి మనది" దానర్థం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలందరు సోదరులే. తెలుగు వారందరం కుల, మత రహితంగా, విభేదాలకు తావివ్వకుండా, ఏకతాటిపై ముందుకు సాగాలని ఆశిస్తున్నాను.

మిత్రులు, TAM అధ్యక్షులు, కూకట్ల శ్రీనివాసరావు గారు పత్రికకు పద సుమాలతో కూర్చిన ఆర్టికల్ వ్రాయమన్నప్పుడు నా మనసులో కలిగిన భావాలకు అక్షర రూపమిది. ఎంతో వ్రాయాలని ఉంది. మనసు విప్పి మరల మరల పంచుకోవాలని ఉంది. అలాగే, భావాలను సరళంగా వ్యక్తీకరించగలిగే ప్రతి ఒక్కరూ TAM పత్రికలో ఆర్టికల్ వ్రాయాలని ఆశిస్తున్నాను.





మీ

నాగ ప్రసాద్ గణపనేని.

Editor in Chief

# Telugu Association of Maryland

# మేరీలాండ్ తెలుగు సంఘం

## అధ్యక్షుని సందేశం




**Srinivas Kukatla**
President

**Vijay Gorrel**
Vice President

**Srinivas Samineni**
Convener

**Sudhakar Gotike**
Secretary

**Srinivas Dama**
Treasurer

**Venkat Naraharisetty**
Jt. Treasurer

**G. Rakesh Madhav**
Chair - Cultural

**Mrs. Kalyani Sunki Reddy**
Event Management Chair

**Sarada Ragummadi**
Chair - Social Media

**Mrudula Mallina**
Women Sports - Chair

**Swathi Ranga**
Chair - Decoration/Stage

**Kotla Tippareddy**
Chair - Sports

**Swathi Kuditipudi**
Education/Literacy/Telugu Promotion-Chair

**Suma Donga**
Membership Promotion - Chair

**Murali Batchu**
Publicity Chair

**Ramki Komakula**
Media Chair

**Raj Pasumarthi**
Community Service - Chair

**Vamsi Reddy Ingu**
Public Relations - Chair

**Naga Prasad Ganapaneni**
TAM Patrika - Chair

**Anitha Muthoju**
Women Forum Chair


'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ వారి అక్షరసత్యాలు ఏ దేశానికైనా అతికినట్లు సరిపోతాయి. భౌతికమైన ప్రేమ వలన కలిగే ఆనందం శాశ్వతం కాదు. ప్రకాశం జిల్లా లోని ఓ మారుమూల గ్రామం నుండి వచ్చిన నేను మా ఊరిలో చేసిన చిన్న చిన్న మంచి పనులు పేదవారి కళ్ళల్లో ఎంతటి ఆనందాన్ని కలిగించాయో చూసినప్పుడు ఆ సత్యం నాకు అవగతమయింది.

ఒక వ్యక్తిగా నేను కొంతవరకు మాత్రమే చేయగలను కానీ ఒక సంస్థ గా చాలా చేయవచ్చు. మన చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ మన తెలుగు రాష్ట్రాలలోని మరిన్ని గ్రామాల్లో చాలా మంది జీవితాల్లో వెలుగు నింపొచ్చు అనే స్ఫురణ వచ్చిందే తడవుగా మేరీలాండ్‌లోని మిత్రుల ముందు అభిప్రాయాలు తెలిపినప్పుడు వచ్చిన స్పందన అమోఘం, అనిర్వచనీయం. 'నేను సైతం' అన్న రీతిలో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సభ్యులుగా మరియు కీలక భాగస్వాములుగా నిలిచారు.

విశేషమైన ఆదరణతో అనుకున్న నెల రోజులు కూడా తిరగక ముందే TAM అవతరణ ఘనంగా మేరీల్యాండ్‌లో జరగడం అద్భుతం. ఒక రాష్ట్రస్థాయి సంస్థ ఇంత వేగంగా రూపుచెందడం కేవలం అందులోని సభ్యుల చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం. ముఖ్యంగా మేరీల్యాండ్ లోని మహిళా సభ్యులు ఒక ఉప్పెనలా ముందుకు వచ్చి ఉత్సాహంగా TAM అవిర్భావం ఇంత తొందరగా జరగడానికి కారణభూతమయ్యారు.

మేరీల్యాండ్ నుండి ఎందరో ఉద్దండులు TAM గౌరవసభ్యులుగా ఉండటానికి సంతోషంగా తమ అభిమతాన్ని తెలియజేయడం TAM విజయాల్లో మొదటిది. ఈ సందర్భంగా  డాక్టర్. శ్రీ యడ్ల హేమ ప్రసాద్ గారికి, డాక్టర్. శ్రీ నరిశెట్టి ఇన్నయ్య గారికి, శ్రీమతి పాకాల రాజశ్రీ గారికి, శ్రీ మీర్ అబ్దుల్లా గారికి, శ్రీ జక్కంపూడి సుబ్బరాయుడు గారికి, మరెందరో భుజం తట్టి ప్రోత్సాహం అందించిన వారందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

"పంచేకొద్దీ పెరిగేది ప్రేమ, చేసేకొద్దీ తిరిగి పొందేది సాయం" అని నేను నమ్ముతాను. ఈ చైతన్యం ఇలాగే అప్రతిహతంగా కొనసాగుతూ మేరీలాండ్ తెలుగు ప్రజల అవసరాలు గమనించి సహాయపడుతూ, తెలుగు వెలుగులు రాజేస్తూ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు కాపాడుతూ, మనకు ఎంతో చేసిన మాతృభూమిలోని గ్రామాలకు చేతనైనంత సేవ చేస్తూ TAMని ఉన్నత విలువలతో నడపటానికి నన్ను తొలి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్న మేరీలాండ్  తెలుగుమిత్రులందరికీ ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. అందరి అంచనాలు అందుకునేలా కష్టపడతాను అని వాగ్దానం చేస్తున్నాను.



మీ... కూకట్ల శ్రీనివాస్

TAM President    మేరీలాండ్ తెలుగు సంఘం

# చెన్నై
# వర్ష 'పాఠం'



చెరుకూరి రాజశేఖర్

మనిషికి మనిషే సాయం అనే నగ్నసత్యాన్ని నిరూపించింది.

అసహనం కొందరి మనుషుల పైత్యమే కానీ భారతీయుడి నైజం కాదని అరచి చెప్పింది.

కాసులతో అన్నివేళలా కులాసాని కొనలేమని రుజువు చేసింది.

ధనవంతులు కూడా గుప్పెడు బియ్యానికి వెతుక్కునే అవసరం రావొచ్చని దరువేసి చాటింది.

ప్రకృతి వికృత రూపం సెలెబ్రిటీని సయితం సామాన్యుడిని చేయగలదని చూపించింది.

కష్ట సమయంలో అసలయిన మందు మానవత్వం అని తేల్చి చెప్పింది... మానవత్వపు విలువను కళ్ళకు కట్టింది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సరిగా ఉపయోగిస్తే వచ్చే లాభాలను కళ్ళముందు ఉంచింది.

ఊహించని పరిణామాలను ఎదుర్కొనే అవసరాన్ని ప్రభుత్వానికి చాటింది.

అభివృద్ధి అంటే ఆకాశహర్మ్యాల అభూతకల్పన కాదు... .కనీస అవసరాల కల్పన... భవిష్యత్తుపై ముందు చూపు ... అని చాచి కొట్టింది.

ఆఖరికి ఎంతటి పండుగాడి కయినా దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యే రోజు రావొచ్చని తీర్పు నిచ్చింది.





# బుర్ర మీసాల పుల్లయ్య తాత



స్వాతి రంగా

చిన్నప్పుడు మా అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెనుక ఒక చిన్న ఇల్లు ఉండేది. వాళ్ళకి ఐదు మంది పిల్లలు, రెండు పెద్ద ఎద్దులు (అదేనండి నేను ఇంతకు ముందు చెప్పాను కదా నా వెంట పడింది అని అది ఇందులో ఒకటి), 50 గొర్రెలు, 50 మేకలు, ఇంకొన్ని కోళ్ళు ఉండేవి. ఈ కుటుంబ పెద్ద నల్లగా, భారీగా, అంత ఎత్తున ఉండేవాడు. తలపాగ, బుర్ర మీసాలు, చేతిలో పెద్ద కర్ర (గొఱ్ఱెల కాపరి కదండి మరి) చూస్తే కాస్త భయం వేసేది, కానీ కాస్త మంచివాడే సుమీ... బుజ్జమ్మా అని పిలుస్తుండేవాళ్ళు నన్ను. అలా నేను ఎప్పుడు ఊరికి వెళ్ళినా పుల్లయ్య తాత వాళ్ళ ఇంట్లో ఆడుకోవడం భలేగా ఉండేది. నాకు తెలిసి నేను మొదటి సారి కోడి పిల్లలను పొదుగుతూ ఉండగా చూసింది ఇక్కడే... అదే కోడి పిల్లని గ్రద్ద తినేయడం ఇక్కడే చూసా. అప్పుడు బాగా ఏడుపు కూడా వచ్చింది. అప్పుడు ఇది సృష్టి చక్రంలో ఒక భాగమని అర్ధమయ్యేలా చెప్పాడు పుల్లయ్య తాత.

రోజూ ప్రొద్దున్నే లేచి మేకలు మేతకు తోలుకుని వెళ్ళే లోపు వాటి దగ్గర పాలు త్రాగడం నాకు ఇంకా గుర్తు... అమ్మమ్మ చెప్తూ ఉండేది మేక పాలు పచ్చివి త్రాగితే చాలా మంచిదని, మనలో రోగ నిరోధకశక్తి బాగా పెంచుతుందని... అలాంటి సమయంలో ఒకసారి లేటుగా లేచా. మేకలన్నీ మేతకు వెళ్ళిపోయాయేమో అని కంగారుగా వెళ్ళిన నాకు ఒకే ఒక మేక బాగా ఏడుస్తూ కనిపించింది. పుల్లయ్య తాతేమో దానిని పొట్టమీద నెమురుతూ ఉన్నారు. సరిగ్గా ఆ సమయంలోనే చూశా, అది ఒక బుల్లి మేకకు జన్మనివ్వడం, అది చూసి నేనేమో గబాలున ఇంట్లోకి పరిగెత్తి సబ్బు తీసుకొచ్చి ఆ బుల్లిమేకను కడగమని గోల గోల చేశాను. అందరూ ఒకటే నవ్వడం మేకపిల్లను సబ్బుతో కడగడం ఏంటని, నేనేమో అసలు వినను కదా చెప్తుంటే, అలా అని సబ్బుతో కూడా కడగలేరు పాపం, అందుకని అప్పుడే మనం పిల్లని తల్లికి దూరం చేయకూడదు, ఆ తల్లి కష్టపడి జన్మనిచ్చిందికదా! కాసేపు తనివి తీరా చూసుకొనే అవకాశం ఇవ్వాలని మా తాతయ్య మాయచేసి కాసేపు మరిపించడానికి చెయ్యాల్సిన, చెప్పాల్సినవన్ని చెప్పి ఇంక ఇది మంకుపట్టు వదిలేలా లేదని, ఆ మేకపిల్లని నాతోనే సబ్బుపెట్టి కడిగించారు. ఎంతబాగుందో బుజ్జి మేక, రోజూ దానితో ఆడుకోవడం భలేగా ఉండేది. అలా నాకు ఉన్న ఇష్టాన్ని గమనించిన పుల్లయ్య తాత ఎప్పుడూ అనేవాడు బుజ్జమ్మా నీ పెళ్ళికి మేకపిల్లను బహుమతిగా తీసుకొస్తాను అని. చివరికి నా పెళ్ళికి ముందుకు కూడా అన్నారు. కానీ అది జరగకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు. ఎక్కడ ఉన్నా మన పుల్లయ్య తాత సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...



# దోసగింజలతో చెట్నీ

- స్వాతి రంగ





ఎప్పుడు దోసకాయలు వండినా ఆ గింజలను తీసివేయడం అలవాటు నాకు. అనవసరంగా పంటి కింద పడతాయని. కానీ వాటితో కూడా మంచి రుచికరమైన పచ్చడి చెయ్యొచ్చని తెలిసాక చాలా సంతోషించా. దోసకాయ కూర వండేటప్పుడు ఎలాగు ముక్కలు కట్ చేస్తాం కదా! అప్పుడే ఆ దోసకాయ గింజలను తీసి చేత్తో కాస్త గుజ్జుగా చేసి పక్కన పెట్టండి. దానికి రెండు స్పూన్లు కారం, తగినంత ఉప్పు, రెండు స్పూన్లు పల్లీలపొడి, రెండు స్పూన్లు తరిగిన ఉల్లిపాయ ముక్కలు కలిపి పక్కన ఉంచి ముందు కోసుకున్న ముక్కలతో ముందే ఏదో ఒక వంట చేద్దామని మనసులో అనేసుకుంటాం కదా, అది చేసెయ్యండి. అది అయ్యేలోపు పక్కన చిన్న గిన్నెలో తాలింపు పెట్టుకోండి. కాస్త నూనె, ఆవాలు, జీలకర్ర, మినపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు, కాస్త పసుపు వేసి ఆ తాలింపుని ముందుగా కలిపిన పచ్చడిలో వేసి రైస్‌కుక్కర్‌లో పెట్టిన అన్నం ఎప్పుడు అవుతుందా అని చూస్తూ ఉండండి. ఇలా అవగానే అలా పెట్టేసుకొని కాస్త నెయ్యి వేసుకొని ఈ దోసగింజల పచ్చడితో భోంచేయడమే. ఆ తరువాత నాకు చెప్పండి రుచి ఎలా ఉందోనని.


UNiFY Solutions Inc.

- Application Development
- Integrated Services Offerings
- ERP & CRM Practice
- Infrastructure & DBA services
- Unify AppWorld

**Unify Solutions, Inc.**

4 West Rolling Crossroads, Suite# 9, Catonsville, MD 21228

**Phone: (410) 455-5152 | Fax :(410) 455-5153**

**http://www.unifysolutions.com**

# TAM ఆధ్వర్యంలో కార్తీకమాసం వనభోజనాలు

'కార్తీకమాసం' అంటే ముందుగా గుర్తుకు వచ్చేది భక్తి ప్రపత్తులతో, నియమ నిష్టలతో ఆచరించే సంప్రదాయాలు మరియూ వనభోజనాలు. ఇంటిల్లిపాదీ బంధువులు, స్నేహితులు, సహృద్భావ వాతావరణంలో కలిసిమెలిసి ఒకే చోట పచ్చని చెట్ల నీడన పిండి వంటలతో భోజనంచేసే సాంప్రదాయం మనుషుల మధ్య మమతలు పెంచడమే కాక సంఘ జీవనాన్ని పిల్లలకు, పెద్దలకు అలవాటు చేస్తాయి. ఇది ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు, పెద్దలు ఆటపాటలతో వినోదాన్ని ఆస్వాదించి చక్కటి చిన్ననాటి జ్ఞాపకాలు ప్రోగు చేసుకొనే గొప్ప కార్యక్రమం. కార్తీకమాసం అంటే తెలుగు వారికి ఎంతో భక్తిపరమైన నమ్మకాలు ఉన్నా వాటిని నమ్మినవారికి మరియు నమ్మనివారు సైతం పైన పేర్కొన్నవి మాత్రం తప్పక ఆస్వాదిస్తారు.

ఈ ముఖ్య ఉద్దేశ్యంతో TAM గైతర్స్‌బర్గ్ చాప్టర్ వారు గైతర్స్‌బర్గ్ ఆర్చిడ్ వ్యాలి కమ్యూనిటీ సెంటర్ ఆవరణలో నవంబర్ 29-2015న వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేరీలాండ్ లోని గైతర్స్‌బర్గ్, జర్మన్ టౌన్ మరియు క్లార్క్స్ బర్గ్ మొదలగు పట్టణాల నుండి దాదాపు 30కి పైగా TAM సభ్యుల కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఇంటి ఆడపడుచు ఒక కమ్మటి తెలుగు వంటకాన్ని స్వయంగా వండి తీసుకొచ్చారు. పిల్లలకు మ్యూజికల్ చైర్స్, బింగో, చిత్రలేఖనం మొదలగు ఆటలు నిర్వహించి బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా తీసిన రాఫిల్ లాటరీలో సతీష్ తిమ్మసముద్రం కుటుంబం విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో TAM ప్రెసిడెంట్ కూకట్ల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ విజయ్ గొర్రెల మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కిరణ్ అమిరినేని, కొండలరావు బొక్కిసం మొదలగు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జరగడానికి ముఖ్య కారకులైన కిరణ్ అమిరినేని గారు ఈ సందర్భంగా వనభోజన మహోత్సవం దిగ్విజయంగా జరగడానికి ఎంతో తోడ్పాటును అందించిన వినోద్ శేఖర్, అప్పారావు పాతూరి, బాల కోటాల, లక్ష్మి పాటిబండ్ల, కొండలరావు, విజయ్ గొర్రెల గార్లకు పసందైన కమ్మని తెలుగు వంటకాలతో కూడిన భోజనం అందించడంలో సహాయం చేసిన కిషోర్ తలసిల, కవిత తలసిల మరియు సతీష్ యడ్లపాటి గార్లకు ఆటపాటలు నిర్వహించి అందరి మెప్పు పొందిన కీర్తి కోతాల గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.




TAM


TAM


NOTICE


TAM

icore Infotech

- IT Consulting
- Application Development
- IT Training (Class Room & Online)
- Health Information Technology
- Search Engine Optimization

## ICORE INFOTECH INC

8726 Town and Country Blvd, Suite 101, Ellicott City, MD 21043
Phone: 1 (301) 221-6677 | hr@icoreinfotech.com
www.icoreinfotech.com

Telligen Tech
Information Technology Services

- Data Warehousing
- Application development
- Project Management
- Business Intelligence
- Identity and Access Management

## Telligen Tech

2740 Airport Drive, Suite 190, Columbus, OH 43219
Phone : (614) 934-1554 | Fax : (614) 934-1001
http://www.telligentech.com

# స్వామి వివేకానంద

– డి.వి.యస్.పి.యల్. కామేశ్వరి,

D/o. డి.వి.యం. సత్యనారాయణ,



భారతీయ ఆధ్యాత్మిక వాణిని పశ్చిమ దేశాలలో తొలిసారిగా వినిపించిన భారతీయుడు మన వివేకానందుడు. భారతీయ ఆధ్యాత్మిక శోభను జగజ్జేగేయమానం గావించిన అసాధారణ సాధు మేధా సంపన్నుడు వివేకానందుడు. స్వామి వివేకానందుడు కలకత్తా నగరంలో 1863 జనవరి 12వ తేదీన జన్మించారు. స్వామి వివేకానంద తండ్రి విశ్వనాథ్ దత్త మంచి పేరున్న వకీలు. తల్లి భువనేశ్వరీ దేవి. వివేకానందుడికి బాల్యంలో 'నరేంద్రనాథ్' అనే పేరు ఉండేది. అందరూ 'నరేన్' అని పిలిచేవారు. ఈయన జన్మదినమైన జనవరి 12వ తేదీనే మన దేశ ప్రజలంతా జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారు.

బాల్యంలో నరేన్‌కు పశుపక్ష్యాదుల పట్ల అపారమైన ప్రేమ ఉండేది. నరేన్ ఎంతో అల్లరి పిల్లవాడు. నరేన్ అల్లరి బాగా మితిమీరిపోయినప్పుడు 'శివశివా' అంటూ నెత్తి మీద చల్లని నీళ్ళు పోస్తే అల్లరంతా క్షణంలో తగ్గిపోయి శాంత పడిపోయేవాడు. బాల నరేంద్రుడు తల్లి వద్ద భాగవత, రామాయణ, మహాభారత కథలు వినేవాడు. నరేంద్రుడికి ధ్యానం అంటే ఎంతో ఇష్టం. దేవుడి గురించి ఆలోచిస్తూ అలా అలా గాఢమైన ధ్యానంలోకి వెళ్ళిపోయేవాడు. ఇక అతడికి ఏమీ వినిపించేది కాదు. దేశమంతా తీర్థయాత్రలు చేస్తూ తిరిగే సాధువులు కాని, హరిదాసులు కానీ, పాటలు పాడుతూ తిరిగే భిక్షగాళ్ళు కానీ తమ ఇంటికి వస్తే నరేంద్రుడు ఎంతో సంతోషపడేవాడు. ఏది కనపడితే అది వారికి ఇచ్చేవాడు. బాల్యంలో నరేంద్రుడికి కులం అనేది ఒక పెద్ద ప్రశ్నార్థక చిహ్నంగా ఉండేది. ఆరేళ్ళ వయసులో నరేంద్రుడు తన విద్యాభ్యాసం మొదలుపెట్టాడు. నరేంద్రుడి జ్ఞాపకశక్తి అమోఘం. పండిట్ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ స్థాపించిన మెట్రోపాలిటన్ ఇన్‌స్టిట్యూషన్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. నరేంద్రుడి తెలివి తేటలు అద్భుతం. నరేంద్రుడికి

ఆటలంటే ఎంతో ఆసక్తి. నరేంద్రుడు బాల్యం నుంచే ఎంతో ధైర్యశాలి. కర్రసాము, కత్తిసాము, గుర్రపు స్వారీ, ఈత, కుస్తీ మొదలైన ఆటల్లో నిపుణుల వద్ద తర్ఫీదు తీసుకున్నాడు. నరంద్రుడు పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. 1880లో నరేంద్రుడు ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రథమ కళా తరగతిలో చేరాడు. 1881లో ఎఫ్.ఏ పరీక్షలలో ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. 1884లో బి.ఎ.లో ఉత్తీర్ణుడై పట్టభద్రుడయ్యాడు. జ్ఞాన సముపార్జనే లక్ష్యంగా నరేంద్రుడు ఎన్నో పుస్తకాలను చదివేవాడు. ఆంగ్లంలో సంభాషించడంలోనూ ఎంతో కృషి చేశాడు. కళాశాలలోని ఆచార్యులంతా యువనరేంద్రుడి ప్రతిభా పాటవాల్ని ధారణాశక్తిని ఎంతో మెచ్చుకున్నారు. తన అనుభవంలో ఈ దేశంలో కానీ పరాయిదేశంలో కానీ ఇంతటి ప్రతిభని చూడలేదని ప్రొ.డబ్ల్యూ.డబ్ల్యూ హేస్టీ అనేవారు. నరేంద్రుడు పెద్ద ఉస్తాదుల దగ్గర నాలుగైదు ఏళ్ళు శాస్త్రీయ సంగీత అభ్యసించాడు. నరేంద్రుడు తన స్నేహితులతోనూ, పెద్దవారితోనూ తాత్త్విక చర్చలు చేసేవాడు. అతడి మేధాసంపత్తి, తర్కించగల శక్తి ముందు ఎవరూ నిలవగలిగేవారు కాదు. నరేంద్రుడు బ్రహ్మసమాజమనే ఆధ్యాత్మిక సంస్థలో చేరి కేశవ్ చంద్రసేన్ మొదలగు ప్రముఖుల ప్రసంగాలు వినేవాడు. నరేంద్రుడిలో సత్యాన్ని తెలుసుకోవాలి, భగవత్సాక్షాత్కారం పొందాలనే తపన ఈ కాల ఘట్టంలో అవధులు దాటింది. భగవంతుడు నిజంగా ఉన్నాడా? ఉంటే భగవంతుడిని చూసినవారు ఎవరైనా ఉన్నారా లేదా? అనే ప్రశ్న నరేంద్రుడిని శూలంగా గుచ్చుకుంటూ ఉండేది. ఈ ప్రశ్నని గొప్ప పండితుల్ని, మత పెద్దలనూ, మహర్షి అనిపించుకున్న దేవేంద్రనాథ్ ఠాకూర్‌ని కూడా అడిగాడు. ఎవరూ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఆధ్యాత్మికత అంటే నరేంద్రుడికి ఇష్టం. కానీ మతం బోధించే చాలా విషయాలలో అతడికి నమ్మకం పోయింది. ఎంతోమంది మతపెద్దల వద్దకి పోయినా ఏమీ ప్రయోజనం లేదు. చివరికి కొంతమంది శ్రేయోభిలాషుల సలహా మేరకు పరమహంసగా కీర్తించబడే శ్రీరామకృష్ణుల వద్దకి వెళదామని నిశ్చయించుకున్నాడు. శ్రీ రామకృష్ణ పరమహంస జీవితమంతా జప, ధ్యాన, భక్తి, యోగ, సాధనలమయంగా ఉండేది.

రామకృష్ణ పరమహంస కలకత్తా నగరానికి ఉత్తరంగా ఉన్న దక్షిణేశ్వర కాళికాలయంలో నివసిస్తూ ఉండేవారు. శ్రీ రామకృష్ణులను కలిస్తే తనకు సమాధానం దొరుకుతుందేమో అని ఆశతో నరేంద్రుడు కొంతమంది స్నేహితులతో ఆయన వద్దకు వెళ్ళారు. రామకృష్ణులవారు అందరినీ సాదరంగా ఆహ్వానించారు. తరువాత నరేంద్రుని మాత్రమే ఆయన వేరొక గదిలోకి తీసుకువెళ్ళి అతి ప్రియమైన మిత్రుని వలె ప్రవర్తించారు. ఆనంద బాష్పాలు సైతం రాలుస్తూ తన చేత్తో మిఠాయిలు తినిపించారు. రామకృష్ణులవారి బలవంతం మేరకు మరలా ఒకసారి త్వరలో ఒంటరిగా వస్తానని ప్రమాణం చేశాడు. 'అయ్యా తమరు భగవంతుడిని చూశారా' అని తన సంశయాన్ని అడిగాడు. వెంటనే సూటిగా 'చూశాను, నిన్నిప్పుడు ఎంత స్పష్టంగా చూస్తున్నానో అంతే స్పష్టంగా చూశాను. కావాలంటే నీకు కూడా చూపించగలను' అని అన్నాడు. ఆ సమాధానానికి నరేంద్రుడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ఒక నెల రోజుల తర్వాత ఒంటరిగా మళ్ళీ దక్షిణేశ్వరానికి వెళ్ళాడు. రామకృష్ణులవారు నరేంద్రుడిని ముట్టుకున్నారు. అప్పుడు నరేంద్రుడు రామకృష్ణుల వారి స్పర్శ మాత్రంచేత తనలాంటి వాడి ప్రపంచమే మారిపోతోందే! అని ఆశ్చర్యపడ్డాడు. నరేంద్రుడు శ్రీ రామకృష్ణులు గొప్ప ఆధ్యాత్మిక శక్తి సంపన్నులనీ ఆయన జీవితం పవిత్రతకు ప్రతిరూపమనీ గ్రహించాడు.

శ్రీరామకృష్ణుల వద్దకి నరేంద్రుడు తరచూ వెళ్ళేవాడు. నరేంద్రుడు జన్మతః ధ్యాన సిద్ధుడనీ, లోక కళ్యాణార్థమై దిగి వచ్చిన మహాత్ముడనీ శ్రీరామకృష్ణులు ఇతరులతో చెప్పేవారు. 1884వ సంవత్సరంలో నరేంద్రుడి తండ్రి మరణించారు. తండ్రి మరణంతో నరేంద్రుని జీవితం తెగిన గాలిపటమైనది. 1885లో రామకృష్ణుల వారికి క్యాన్సరు వ్యాధి సోకింది. గురువు గారిని శిష్యులంతా దక్షిణేశ్వరం నుంచి కాశీపూర్ అనే ప్రాంతానికి తీసుకువెళ్ళారు. అక్కడ గురువుగారితో ఎక్కువ సమయం గడిపింది నరేంద్రుడే. మానవ జన్మనెత్తిన వారందరికీ జీవిత ఉద్దేశ్యం భగవత్సాక్షాత్కరమేనని అందుకై తీవ్రంగా ప్రయత్నించాలనీ నరేంద్రుడి ధృడవిశ్వాసం. ఒకనాడు నరేంద్రుడికి అత్యున్నతమైన ఒక ఆధ్యాత్మిక అనుభూతి కలిగింది. ధ్యానంలో తీవ్రంగా నిమగ్నమై ఉన్న నరేంద్రుడు కళ్ళు తెరవడానికి ప్రయత్నించగా అతడికి భగవంతుడు తప్ప ప్రపంచమేమీ కనబడడం లేదు. అతడి మనస్సు భగవంతుడితో పరిపూర్ణంగా లయమవడంతో ఇటువంటి అనుభూతి కలిగింది. దీన్ని 'నిర్వికల్ప సమాధి స్థితి' అంటారు. శ్రీరామకృష్ణులవారు ఇతర శిష్యుల భౌతిక, ఆధ్యాత్మిక ప్రగతి యొక్క బాధ్యతని నరేంద్రునికి అప్పగించారు. 1886 ఆగష్టు 16వ తేదీన శ్రీ రామకృష్ణ గురుదేవులు తమ మనుష్యరూప నాటకానికి తెరదించారు. గురుదేవుని మరణానంతరం కాశీపూర్ నుంచి బాలానగర్‌కి వచ్చి అక్కడ పాడుబడ్డ చిన్న ఇంటిని ఒక భక్తుడి తోడ్పాటుతో శిష్యులు అద్దెకు తీసుకున్నారు. ఇదే భావి రామకృష్ణ

సంప్రదాయం యొక్క ప్రథమ మఠం. నరేంద్రుడు, మిగిలిన శిష్యులంతా సన్యాస జీవితానుసారం కొత్త పేర్లని తీసుకున్నారు. నరేంద్రుని మాత్రం అందరూ 'స్వామీజి' అని పిలిచేవారు. స్వామిజీ బారానగర్ మఠంలో రెండేళ్ళు నివసించారు. ఇతర సన్యాసులు కొంతమంది మఠాన్ని వదిలి తీర్థయాత్రలకని బయల్దేరారు. స్వామీజీ కూడా 1888లో కాశీకి ప్రయాణమయ్యారు. తరువాత ఉత్తర భారతంలోని అనేక నగరాలను సందర్శిస్తూ స్వామీజీ హత్రాస్ అనే చోటికి వచ్చారు. ఆ ఊరి రైలుస్టేషన్ మాస్టర్ శ్రీ శరత్‌చంద్రగుప్త ఆయన శిష్యుడై తన పేరున సదానంద స్వామిగా మార్చుకుని స్వామీజీ ని అనుసరించారు. ఇద్దరూ హృషీకేష్ వెళ్ళారు. కానీ ఇద్దరి ఆరోగ్యం చెడిపోవడంతో బారానగర్ మఠానికి తిరిగి వచ్చారు. 1890లో మళ్ళీ యాత్రలకి బయల్దేరి ఎన్నో ఏళ్ళ దాకా వెనక్కి రాలేదు. ఒక సోదర సన్యాసితో కాశీ మరియు హిమాలయ ప్రాంతాలలో తిరిగారు. అలా తపస్సు చేసుకుంటూ దేశ పరిస్థితుల్ని గమనిస్తూ ఉండేవారు స్వామీజీ. వీరుల రాజ్యమైన రాజ్‌పుటానా లోని ఆళ్వార్‌లో అక్కడి రాజు మంగళ్ సింగ్‌తో మాట్లాడారు. స్వామీజీ మౌంట్ అబు అనే ప్రదేశంలో ఖైత్ర మహారాజుని కలిశారు. రాజుగారు స్వామీజీ శిష్యుడయ్యారు. ఖేత్రీలో కొంతకాలం రాజగురువుగా  గడిపారు స్వామీజీ. స్వామీజి దక్షిణాదిలో కూడా విస్తృతంగా పర్యటించారు. యాత్ర సాగిస్తున్నప్పుడు స్వామీజీ వద్ద ఒక చిన్న భగవద్గీత మరియు 'ది ఇమిటేషన్ ఆఫ్ క్రైస్ట్' అనే గ్రంథాలు తప్ప ఇంకేమీ ఉండేవి కావు. ఒక రోజు రాజమందిరంలో, ఒక రోజు పూరిగుడిసెలో నేలపై పరుండేవారు. ఒక్కోరోజు ఆకాశమే పై కప్పుగా, గడ్డి మాత్రమే పరుపుగా ఉండేవి. ఎవరైనా పిలిచి భిక్ష ఇస్తే తప్ప తీసుకోకూడదనే నియమాన్ని పాటించేవారు. బ్రహ్మ తేజముట్టిపడే ముప్ఫై ఏళ్ళ ఆ యువ సన్యాసి కళ్ళలో నీరు ధారలై కారుతోంది. ఆధ్యాత్మిక జగత్తుకి రారాజైన ఆ సన్యాసి తన మాతృదేశంపై, దేశ పూర్వ వైభవంపై ప్రస్తుత దాస్యంపై ప్రశ్నార్థకమైన భవిష్యత్తుపై ధ్యానం చేయనారంభించాడు.

అమెరికా దేశంలో జరగబోతున్న సర్వమత మహాసభలో పాల్గొని భారతదేశపు ధర్మాన్ని ప్రపంచానికి సరైన విధంగా తెలియజేయాలని నిశ్చయించుకున్నారు స్వామీజీ. ఖేత్రీ మహారాజు ఆ సమయంలో స్వామీజీ ఆలోచన విని కెనడాకి వెళ్ళే ఒక ఓడలో ప్రథమ శ్రేణి టిక్కెట్టు కొని ఇచ్చారు. ఆయన స్వామీజీకి కాషాయ వస్త్రాలు బహూకరించి 'వివేకానంద' అనే నామధేయాన్ని స్వీకరించవలసినదిగా ప్రార్థించారు. స్వామీజీ ఈ విధంగా వివేకానంద స్వామి అయ్యారు. వివేకానంద స్వామి బొంబాయి



నుండి 1893 మే 31వ తారీఖున అమెరికాకు బయలుదేరారు. కొన్నాళ్ళకు ఓడ కెనడా దేశంలోని వాంకోవర్‌లో ఆగింది. స్వామీజీ అక్కడి నుండి షికాగోకి రైలులో వెళ్ళారు. రైల్లో సాన్‌బోర్న్ అనే మహిళ స్వామీజీ ప్రతిభాపాండిత్యాలని గమనించి బోస్టన్ నగరానికి వచ్చినప్పుడు తమ ఇంటికి రావలసినదిగా ఆహ్వానం ఇచ్చింది. షికాగో చేరుకోగానే స్వామీజీ, తన వద్ద కావలసిన ధ్రువపత్రాలేవీ లేనందున వక్తగా పాల్గొనడం కుదరదని, పత్రాలు ఉన్నా వక్తలను అంగీకరించే సమయం మించిపోయిందని తెలుసుకున్నారు. అప్పుడు స్వామిజికి సాన్‌బోర్న్ ఆహ్వానం గుర్తుకు వచ్చి బోస్టన్ నగరం చేరుకున్నారు. ఆవిడ ఇంట్లో ఉండగానే హార్వడ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసరైన జె.హెచ్.రైట్ అనే వ్యక్తితో స్వామీజీకి పరిచయమైంది. స్వామీజీ పాండిత్యాన్ని చూసి జరగబోయే విశ్వమత మహాసభలలో పాల్గొనవలసినదిగా కోరారు. స్వామీజీ తాను వచ్చింది అందుకేనని కానీ తన వద్ద ధ్రువపత్రాలేవీ లేనందున సభలో పాల్గొనడం కుదరదని విన్నాననీ తెలిపారు. అది విని విస్తుబోయిన ఆ అమెరికా పండితుడు మహాసభల అధ్యక్షుడికి ఒక ధ్రువపత్రం వ్రాసారు. అంతేగాక షికాగో వరకూ ఒక టిక్కెట్టు కూడా కొని ఇచ్చారు.

1893 సెప్టెంబర్ 11 వ తేదీన విశ్వమత మహాసభలు కొలంబస్ హాల్ అనే ఒక పెద్ద భవనంలో జరిగాయి. స్వామీజీ పేరుని ఉపన్యసించుటకు పిలువగానే శ్రావ్యమైన ఆయన కంఠంతోనూ పవిత్రమైన ఆయన హృదయాంతరాళాలలో నుంచి వచ్చిన విశ్వమాన సౌభ్రాతృత్వ భావనతోనూ 'నా అమెరికా సోదర సోదరీమణులారా!' అని మొదలుపెట్టారు. అంతలోనే ఆ జనసంద్రమంతా ఒక్కసారిగా లేచి నుంచుని కమ్మని ఆ పిలుపుకి కరతాళ ధ్వనుల వర్షం కురిపించారు. అందరూ కూర్చున్నాక స్వామీజీ కొనసాగించారు. భారతీయ ధర్మం అన్ని మతాల్ని అంగీకరిస్తుందనీ, గౌరవిస్తుందనీ, అన్ని మతాలు సత్యాలేనని, ఎవరూ మతం మార్చుకోవలసిన అవసరం లేదని స్వామీజీ తెలిపారు. మిగతా వక్తలు తమ తమ మతాలకే ప్రాతినిధ్యం వహిస్తే, స్వామీజీ మాత్రం అన్ని ధర్మాల తరుపున మాట్లాడి నిజమైన తమ సామరస్యాన్ని చూపారు. సభాసదులందరికీ స్వామీజీ ప్రసంగమే నచ్చింది. రాత్రికి రాత్రి స్వామీజీ ఖ్యాతి అమెరికా దేశమంతటా వ్యాపించింది. పత్రికలన్నీ స్వామీజీని వేనోళ్ళ పొగిడాయి. భారతీయులంతా స్వామీజీని చూసి చాలా గర్వించారు. ఆ తరువాత స్వామీజీ ఇంగ్లాండు దేశానికి వెళ్ళి రెండు నెలలు విజయవంతంగా ధర్మప్రచారం చేశారు. మళ్ళీ న్యూయార్కు వచ్చారు. భారతదేశం పశ్చిమ దేశాలకు ధర్మము, ఆధ్యాత్మికతను బోధించాలని, వాళ్ళు భారతీయులకు సైన్సు, సాంకేతికత వంటివి నేర్పించాలనేది ఆయన కల. తరువాత స్వామీజీ జర్మనీ వెళ్ళారు. అక్కడ జర్మన్ సంస్కృత పండితుడైన ప్రొఫెసర్ డుసెన్‌ని కలిశారు. ఇక స్వామీజీ భారతదేశానికి తిరిగి రావాలని నిశ్చయించుకున్నారు. స్వామీజీ తిరిగి రావడం భారతదేశపు జవసత్వాలు తిరిగి రావడమే అయింది. 1897 జనవరి 15వ తారీఖున మళ్ళీ వివేకానంద స్వామి భారతదేశంలో కాలు పెట్టారు. ఆయన్ని స్వాగతించడానికి ఎన్నో ఏర్పాట్లు జరిగాయి. ప్రజలు స్వామీజీకి బ్రహ్మరథం పట్టారు. 1897 మే నుండి 1898 జనవరి వరకూ స్వామీజీ ఉత్తర భారతదేశంలో ఎన్నో నగరాలకు వెళ్ళారు. 1897 మే1వ తారీఖున 'రామకృష్ణ మిషన్' అనే సంఘాన్ని స్వామీజీ స్థాపించారు. 1898 డిసెంబర్‌లో బేలూరు మఠాన్ని స్థాపించారు. 1899లో మళ్ళీ విదేశాలకు వెళ్ళారు. అక్కడ న్యూయార్కులో కొన్ని తరగతులు నిర్వహించారు. కాలిఫోర్నియా, లాస్ ఏంజిల్స్ కు వెళ్ళి అక్కడ వారి కోరిక మేరకు వారికి భారతీయ శాస్త్రాలు, ఇతిహాసాలపై ఉపన్యసించారు. శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళి అక్కడ వేదాంత తత్త్వమూ, ధ్యానమూ నేర్పించారు. అక్కడ వచ్చిన అద్భుతమైన ప్రతిస్పందన వలన అక్కడ స్వామీజీ 'వేదాంత సొసైటీ ఆఫ్ శాన్‌ఫ్రాన్సిస్కో' అనే ఆశ్రమాన్ని స్థాపించారు.

తరువాత స్వామీజీకి ప్యారీస్‌లో జరగబోయే విశ్వమత చరిత్రల మహాసభలలో పాల్గొనమని ఆహ్వానం అందింది. స్వామీజీ తన శిష్యులైన లెగ్గట్ దంపతులతో ప్యారిస్ బయలుదేరారు. 1900 ఆగష్టు1వ తేదీన స్వామి వివేకానంద ప్యారిస్ చేరుకున్నారు. విశ్వమత చరిత్రల మహా సభలలో స్వామీజీ ఫ్రెంచి భాషలో ఉపన్యసించారు. సభలలో వారంతా అడిగే కఠినమైన ప్రశ్నలకి స్వామీజీ ఫ్రెంచి భాషలో సునాయాసంగా సమాధానాలిచ్చారు. ఆయన కీర్తి అక్కడ కూడా బాగా వ్యాపించింది. ఆ తరువాత స్వామీజీ టర్కీ ఆస్ట్రియా, ఇస్తాన్‌బుల్ వెళ్ళారు. తరువాత గ్రీసు వెళ్ళి కొన్ని రోజులక్కడే గడిపారు. ఇంకో ఓడలో ఈజిప్టు వెళ్ళారు. 1900 డిసెంబరు 9వ తేదీన స్వామీజీ ఒంటరిగా భారతదేశంలోని బేలూరు మఠం చేరుకున్నారు. భారతదేశంలో స్వామీజీ ఎన్నో చోట్ల ఉపన్యసించారు. అప్పటి తూర్పు బెంగాల్ రాష్ట్రంలోని ఢాకా వెళ్ళారు. స్వామీజీ వాళ్ళ అమ్మ కూడా ఆయనతో ఈ యాత్ర చేశారు. తరువాత గువహాటి, షిల్లాంగ్ వెళ్ళి ఉపన్యసించారు. స్వామీజీ తిరిగి బేలూరు మఠానికి చేరుకున్నారు. అక్కడ ఆయన ఎంతో మందికి దర్శనమిచ్చి మాట్లాడేవారు. సన్యాసి బ్రహ్మచారులకు తరగతులు నిర్వహించేవారు. స్వామీజీ ఎన్నో జంతువులను కూడా తన ఆశ్రమంలో పెంచేవారు. స్వామీజీకి అఖండమైన ఏకాగ్రత ఉండేది. ఆయన అఖండమైన బ్రహ్మచర్యం పాటించేవారు. మతం ముసుగులో అంటరానితనం తప్పుడు భావనలు, మూఢనమ్మకాలు చెలామణీ అవుతూ దేశాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని నిజమైన మతం లేదా ధర్మం మనిషిని భగవంతుడి వద్దకు చేర్చే మార్గమనీ, అందుకు త్యాగం, సేవ, శ్రద్ధ వంటివే సాధనాలని వక్కాణించారు. 'లేవండి! మేల్కొనండి! గమ్యం చేరేవరకూ విశ్రమించకండి' అనేది స్వామి వివేకానందుని నినాదం.

స్వామీజీ ఎక్కువ కాలం జీవించదలచుకోలేదు. అది 1902, జూలై 4వ తేదీ. ఆ రోజు స్వామీజీ పొద్దున లేచి తన అలవాటుకి భిన్నంగా అన్నీ కిటికీలు, తలుపులూ మూసుకొని మూడు గంటల సేపు గాఢ ధ్యానంలో గడిపారు. సాయంత్రం స్వామీజీ శిష్యుడిని పిలిచి గాలి విసరమన్నారు. ఆయన మంచంపై పడుకున్నారు. స్వామీజీ చేయి కొంచెం కంపించింది. రెండుసార్లు దీర్ఘంగా ఊపిరి పీల్చారు. కొంతసేపటికి స్వామీజీ కదలలేదు. పరీక్షిస్తే స్వామీజీ దేహంలో ఊపిరి లేదని గ్రహించారు. స్వామీజీ ఇక శాశ్వతంగా ఆ శరీరాన్ని వదిలివేశారు. స్వామీజీ తుది శ్వాస వరకూ ప్రజలని చైతన్యవంతులని చేసి తమ కాళ్ళ మీద తాము నుంచోగలిగేట్లు చేయడం కోసం శ్రమించారు.

- WebSphere MQ
- WebSphere Message Broker
- WebSphere Information Integrator
- WebSphere Application Server *and*
- WebSphere Portal Server

## APEX IT Services

10632 Little Patuxent Parkway, Suite 107, Columbia, Maryland 21044
info@apex-its.com | careers@apex-its.com | http://usa.apex-its.com

---

- Oracle Applications Consulting
- SOA/BPM/Integration
- Enterprise Portal
- Information Management
- Peoplesoft Upgrade
- Health IT

PACE Computer Solutions, Inc
10500 Little Patuxent Pkwy, Suite # 310,
COLUMBIA, MD 21044
P: (443) 539-0290 | F: (443) 539-0292 | info.us@pace-solutionsinc.com
http://pace-solutionsinc.com/

---

## JOB Guaranteed QA Training

- **$500 Only**
- **Job Guaranteed**
- **QA Training Manual**
- **Automation (QTP)**
- **Selenium**
- **Mobile Testing**

**BvenJ Technologies**

**Class Room Training in Ellicott City, Owings Mills.**

**Contact @ (703) 786-6886**

# సంక్రాంతి

- సందిరెడ్డి కొండలరావు



ప్రజలకు ఆనందాన్ని పంచి, అనుబంధాన్ని, ఆప్యాయతలను పెంచేవి పండుగలు. అందునా సంక్రాంతి పల్లెతల్లి పల్లెల్లో పల్లవించిన పెద్దపండుగ. పొలం నుండి తన ఇంటికి చేరిన ప్రతి పంటను, రక్తం పంచుకు పుట్టిన బిడ్డలా కళ్లారా చూచుకొని పొంగిపోయే కర్షకుల పండుగ. మట్టిని పెనవేసుకొని బ్రతుకును నెట్టుకొస్తున్న శ్రామికుల పండుగ ఇది. మార్గశిర పుష్యమాసంలో పంటసిరులను వెంట తెచ్చే ఈ పర్వదినం, వృత్తిపనులవారికి, కాపులకు సహజీవనం బంధం అనడంలో అతిశయోక్తిలేదు. పండక్కి ముందు నెల నుండి అంటే డిసెంబర్ 14, 15 తేదీల్లోనే పండుగ నెల పెడతారు. ఇలా నెల రోజులపాటు పండుగ వాతావరణం గ్రామల్లో అలుముకుంటుంది. కానుకల పండుగ, కాపుల పండుగ, పొంగళ్ళ పండుగ, వసూళ్ళ పండుగ, మ్రొక్కుల పండుగ అని వివిధ నామాలతో వ్యవహరించడాన్ని బట్టి ఈ పర్వదిన ప్రాముఖ్యం అవగతమౌతుంది.

మేషం మొదలు మీనం వరకున్న పన్నెండు రాశుల్లో సూర్యుడు ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క రాశిలో పరిభ్రమిస్తాడు. సూర్యుడు ఉత్తర దిశగా ప్రయాణం ప్రారంభిస్తూ మకరరాశిలోకి సంక్రమణం జరుగుతున్న ఈ రోజు మకర సంక్రాంతి. ముక్కోటి దేవతలుండే ఉత్తర దిక్కు అతి పవిత్రమైనదని, ఉత్తరాయణంలో పరమపదిస్తే పరమపదం ప్రాప్తిస్తుందనే విశ్వాసం ప్రబలంగా ఉన్నది. దీనికి భీష్మపితామహుని అంత్య వృత్తాంతాన్ని ఉదహరిస్తుంటారు. ఈ ధనుర్మాసంలోనే స్త్రీలు కాత్యాయని వ్రతాలు చేసేవారని, ఈ పుణ్యదినాల్లోనే ఎన్నో మహత్యాలు జరిగినట్లు పురాణాల్లో ఉదహరించబడింది. ఈ రోజుల్లో గ్రామదేవతలైన గంగమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, సంకాలమ్మ వంటి గ్రామదేవతలకు కొలువు చేసి, ప్రభలు కట్టి, పొంగళ్ళు పెట్టి సిడిమాను ఊరేగించి, వేటల్ని ఊరుచుట్టు తిప్పి వాటిని బలిచ్చి పొలిమేరలు తిరిగి వస్తే ఊరికి కీడురాదని నమ్మకం ఉంది. గోదాదేవి తిరుప్పావై సరాగాలై పందిరెక్కింది ఈ రోజుల్లోనే కదా. ప్రాచీన, ఆధునిక కవివరేణ్యులెందరో తమ హృదయాలను విరబూసిన ముద్దబంతి, చేమంతి, గుమ్మడిపూలు చేసికొని సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు.

మానవజాతి పరిణామంలో మనిషి నిప్పును కనిపెట్టడం, దాన్ని కనిపెట్టుకొని వుండడం, దాన్నుండి సిరిసంపదల్ని ఆశించడం, తన ప్రగతికి దాన్నొక ప్రధాన సాధనంగా వినియోగించుకోవడం జరిగింది. సంక్రాంతి పండుగ మొదటిరోజైన భోగినాడు వేసే భోగిమంట పై చరిత్రకొక చురుకైన సాక్ష్యం - చర్మం చురుక్కుమననాలి, చలితోక ముడవాలి. ఈ అనుభూతి ఏడాదిపాటుండాలి గదా మరి. సంక్రాంతి ముగ్గల్లో కళాత్మకత వెల్లి విరుస్తుంది. గీతలముగ్గు ఆర్యసంప్రదాయమని, ఈ రెంటిని మేళవించడం ఆంధ్రుల సంప్రదాయమని పరిశీలకుల ఉవాచ. సంక్రాంతి లక్ష్మికి, వైకుంఠపాళి, రథం ముగ్గులు స్వాగతం పలుకుతాయి. ముగ్గల్లో ముద్దుగుమ్మలు తీర్చిన గొబ్బిళ్ళు వాటిపైన అలంకరించిన రంగు రంగుల పూలు ఇంటి ముంగిట క్రొత్త అందాలు సంతరిస్తాయి. గొబ్బిని గౌరీదేవిగా పూజిస్తారు. ఈ

